ఇందిరమ్మ ఇళ్ల 'పురోగతి'


చిన్నాయిపల్లిలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి(ఫైల్)

- జిల్లాలో ప్రారంభమైన ఇళ్ల నిర్మాణం
- మొదటి విడతలో 1317 మంది లబ్ధిదారుల గుర్తింపు
- దశల వారీగా మేస్త్రీలకు శిక్షణ
- పనుల వేగవంతంపై అధికార యంత్రాంగం దృష్టి


పోతన్‌పల్లిలో పూర్తయిన బేస్‌మెంట్

గండేడ్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పురోగతి అందుకుంది. ప్రజాప్రతినిధులు, ఇల్లు లేని వారికి గూడు కల్పించేందుకు అధికార యంత్రాంగం దృష్టిసారించి పనులు వేగవంతం చేస్తోంది. త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసి వారి మన్ననలను పొందే దిశగా అడుగులు వేస్తున్నారు. నిరంతర ప్రక్రియగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మొదటి విడతగా నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్లు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. నిర్మాణ దశలను బట్టి బిల్లులు అందజేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు, అయితే ముందుగా మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 16 మండలాల్లో రాంచంద్రాపూర్, అప్పాజిపల్లి, భట్టుపల్లి, దమగ్నాపూర్, మీనిపోయినపల్లి, జానంపల్లి, ఇబ్రహీంబాద్, మల్లెబోయినపల్లి, అయ్యవారిపల్లి, తిర్మలాపూర్, పోతన్‌పల్లి, డోనూర్, మూసాపేట్, దీపల్లి, రంగారెడ్డిగూడ, చిన్నాయిపల్లి గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. జిల్లాలో 16 మండలాల్లో ఇల్లులేకుండా స్థలం ఉన్నవారు 66,518 మంది లబ్ధిదారులు ఉండగా, ఇల్లు లేకుండా స్థలం లేనివారు 31,255 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వారిలో పైలెట్ ప్రాజెక్టు గ్రామాల్లో 1317 మంది లబ్ధిదారులకు మొదటి విడతగా ఇళ్లు మంజూరు చేశారు. రూ.5లక్షలతో 400 లేదా 500 చదరపు ఫీట్లలో ఇళ్లు నిర్మించుకోవాలని ప్రభుత్వం నమూనా రూపొందించింది. దీనికి సంబందించి అన్ని గ్రా మాల్లో లబ్ధిదారులకు జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ వారు సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించారు.

మేస్త్రీలకు శిక్షణ..

గ్రామాల్లో నిర్మాణాలు ఆగకూడదని మేస్త్రీల సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎంపికయిన గ్రామం నుండి మేస్త్రీలను ఎంపిక చేసి ప్రభుత్వం సూచించిన నమూనా ప్రకారం ఎలా నిర్మించాలో శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా నిర్మాణంలో మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈమేరకు కలెక్టర్ విజయేందిర బోయి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. పైలేట్ ప్రాజెక్టుగా ప్రకటించిన అన్ని గ్రామాల్లో ఇద్దరు ముగ్గురు చొప్పున ఆసక్తి గల మహిళలను ఎంపిక చేసి హౌసింగ్ కార్పొరేషన్ న్యాక్ సంయుక్త ఆధ్వర్యంలో వారికి మహబూబ్‌నగర్ బండమీది పల్లిలో శిక్షణ ఇస్తున్నారు. ఇళ్ల నిర్మాణానికి ఇప్పటి వరకు 54 మందికి శిక్షణ ఇవ్వగా, వారిలో 14 మంది మగవారు ఉండగా 40 మంది మహిళా మేస్త్రీలు ఉండడం విశేషం.


ఓబులాయిపల్లిలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని సందర్శించిన కేంద్ర కమిటీ సభ్యులు(ఫైల్)

ప్రారంభమైన ఇళ్ల నిర్మాణం..

కోయల్‌కొండ, బాల్‌నగర్, మహమ్మదాబాద్, గండేడ్, రాజాపూర్, నవాబ్‌పేట్, మిడ్జిల్ తదితర మండలాలోల్ నిర్మాణం పనులు ఊపందుకుంటున్నాయి. 1317 ఇళ్లకు గాను 300 ఇళ్లకు మార్కింగ్ ఇవ్వగా 60 ఇండ్లు బేస్‌మెంట్‌లు పూర్తయ్యాయి. పనులు ప్రారంభం కావడంతో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం చోటుచేసుకుంది. గండేడ్ మండలంలో జానంపల్లిలో 79 ఇళ్లు మంజూరు కాగా, 18, మహమ్మదాబాద్ మండలం చిన్నాయిపల్లిలో 20 ఇళ్ల నిర్మాణం ప్రారంభం అయ్యాయి.

నిర్మాణానికి ఊతం..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఊతమిస్తున్నది. నిర్మాణానికి అవసరమైన ఇసుక ఉచితంగా ఇస్తున్నది. బేస్‌మెంటు, లెంటల్, స్లాబ్, ఫినిషింగ్ స్టేజీల్లో రెండు ట్రాక్టర్ల చొప్పున ఇసుక ఇస్తున్నారు. దీంతో పాటు ఇటుక తయారు, సెంట్రింగ్‌లను సమకూర్చే విధంగా జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ సూచన మేరకు నిర్మాణం కొనసాగుతోంది.

ఇల్లు మంజూరు ఆనందంగా ఉంది..



ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం ఆనందంగా ఉంది. గుడిసెలో ఉంటున్నా. ఎండకు వానకు ఇబ్బందులు పడేవాళ్లం. కొత్తగా ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక ఉంది. మొదటి దశలో ఇల్లు మంజూరు కావడంతో ఇల్లు కట్టుకునే అవకాశం కలిగింది. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులతో వారిచ్చిన నమూనా ప్రకారం ఇల్లు నిర్మించుకుంటాం.

– పిట్ల సత్యమ్మ, జనంపల్లి, గండేడ్

లబ్ధిదారులకు తోడ్పాటు..



జిల్లాలో ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రణాళిక బద్ధంగా ఇతోదక తోడ్పాటు అందిస్తున్నాం. ఇల్లు మంజూరైన ప్రతి లబ్ధిదారు ఇల్లు కట్టుకునేలా లక్ష్యంగా పెట్టుకున్నాం. గ్రామాల్లో అవగాహన సదస్సులు పెట్టి నమూనా ప్రకారం ఇల్లు కట్టుకునేలా ప్రోత్సాహిస్తున్నాం. డీఈఈలతో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నాం. సెంట్రింగ్‌తో పాటు మేస్త్రీల సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– భాస్కర్, హౌసింగ్ పీడీ, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

మార్కెట్‌కు వరుస సెలవులు

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్‌కు వరుస సెలవులు ఇచ్చారు. శనివారం అమావాస్య కారణంగా మార్కెట్‌కు సెలవు కావడంతో లావాదేవీలు జరగలేదు. ఆదివారం సాధారణ సెలవుతో పాటు ఉగాది పండుగ సందర్భంగా సెలవు ఇచ్చారు. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా సెలవు ఇవ్వగా మంగళవారం కూడా ప్రభుత్వం సెలవు ప్రకటించింది. దీని వల్ల మార్కెట్ మంగళవారం వరకు మూసి వేయనున్నట్లు అధికారులు తెలిపారు. తిరిగి బుధవారం ఉదయం ఉల్లి వేలంతో మార్కెట్ లావాదేవీలు జరుగుతాయిన పేర్కొన్నారు.

ఘనంగా ఉగాది పురస్కారాలు

జడ్చర్ల: ఓ ఫంక్షన్‌హాల్లో శనివారం జాతీయసాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కవి పొద్దుటూరి ఎల్లారెడ్డి హాజరయ్యారు.అనంతరం పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ శివకుమార్, కవులు యాదగిరి, జానకిరాములు, నరేష్, పరిషత్ అధ్యక్షురాలు పద్మలీల, మహేశ్వర్, రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

పశువుల సంత వేలం రూ.10.77,500 లక్షలు

మిడ్జిల్: మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే పశువుల సంతకు శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన బహిరంగ వేలం పాటలో 18 మంది పాల్గొన్నారు. వేలం పాటలో మిడ్జిల్‌కు చెందిన మామిడిమాడ అశోక్‌కుమార్ రూ.10.77,500 లక్షలతో దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి సాయన్న తెలిపారు. కూరగాయల సంతకు 17 మంది వేలం పాటలో పాల్గొనగా వడ్డె కృష్ణ రూ.1.59,500లక్షలకు దక్కించుకున్నట్లు కార్యదర్శి తెలిపారు.

పౌర హక్కులకు భంగం కలిగించొద్దు



దేవరకద్ర రూరల్: సమాజంలో ఎవరి హక్కులకు భంగం కలిగించొద్దని తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. శనివారం బస్వాయపల్లిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. పౌర హక్కులకు భంగం కలిగించే విధంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో కుల వివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించాలని, అన్ని కులాలు, వర్గాలు సోదరభావంతో మెలగాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



దేవరకద్ర: గ్రామీణ ప్రాంత ప్రజలు, యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నాగన్న, శిక్షణ ఎస్ఐ కృష్ణాజీ సూచించారు. శనివారం మండలంలోని పెద్దరాజమూర్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సెల్ ఫోన్ల ద్వారా సైబర్ నేరగాళ్ల ప్రలోభాలకు గురి చేసే అవకాశం ఉందన్నారు. బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలు, వ్యక్తిగత వివరాలను ఎవరికి చెప్ప రాదని సూచించారు. యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దని, తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. గ్రామాలలో ప్రజలందరు కలిసి మెలిసి ఉండాలని, ఆవేశాలు పనికిరావని శాంతియుత వాతావరణం నెలకొనే విధంగా చూడాలని కోరారు.

'అవినీతి ఉద్యోగిని తప్పించండి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొన్నేళ్లుగా హన్వాడలోని మండల విద్యావనరుల కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఎ.విష్ణువర్ధన్‌కుమార్ పలు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ (బీసీటీఏ) జిల్లా అధ్యక్షుడు తుప్పలి రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి కొరపాటి ధనుంజయ్ ఆరోపించారు. ఈయనపై తగు చర్యలు తీసుకోవాలంటూ శనివారం కలెక్టరేట్‌లోని డీఈఓ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎఫ్ఎంఎస్ ఖాతాలకు సంబంధించిన యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ తన వద్దే ఉంచుకున్నారని పేర్కొన్నారు. ప్రతి ప్రింట్ అడ్వైజ్‌కు రూ.500 చొప్పున డిమాండ్ చేస్తున్నారన్నారు. విద్యా సంవత్సరంలో యూడైస్ వెబ్‌సైట్‌లో కొత్త అడ్మిషన్ల నమోదుకు ఒక్కో పాఠశాల నుంచి రూ.నాలుగు వేల నుంచి రూ.ఐదు వేల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారన్నారు. ఫిర్యాదులో టీపీఆర్‌టీయూ, పీఆర్‌టీయూ టీజీ, యూటీఎఫ్, పీఎస్‌డీటీ సంఘాల నాయకులు సైతం సంతకాలు చేశారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి


భూత్పూర్‌లో రైతులకు స్ప్రింక్లర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్/అడ్డాకుల/చిన్నచింతకుంట: ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మునిరంగస్వామి దేవాలయం వద్ద మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 54 మంది రైతులకు స్ప్రింక్లర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే

మూసాపేట మండలం చక్రాపూర్ గ్రామానికి చెందిన జగదీష్ కుమారుడు శివప్రసాద్ నరాలకు సంబంధిత వ్యాధికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్య సాయం కోసం దరఖాస్తు చేసుకోగా, సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరు కావడంతో దేవరకద్ర ఎమ్మెల్యే బాధితులకు అందజేశారు.

పండుగలు సంతోషంగా చేసుకోవాలి

పండుగలను ప్రతి ఒక్కరు సంతోషంగా చేసుకోవాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. చిన్నచింతకుంట మండల కేంద్రంలో ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌కు హాజరయ్యారు. ముస్లిం పెద్దలకు ఖజూరాలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

జైసంవిధాన్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఏఐసీసీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ పట్టణ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ కొత్వాల్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఏఐసీసీ అధ్యక్షుడిగా ఎన్నికై వందేళ్లు పూర్తయిందని, రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు అవుతుందన్నారు. అంబేడ్కర్ పట్ల పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అనుచితంగా మాట్లాడారన్నారు. అమిత్‌షా రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీతో పాటు దేశ ప్రజలందరూ డిమాండ్ చేశారని, కాని ఆయన చేయలేదన్నారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్ సిద్ధాంతాలు, రాజ్యాంగ విలువలను కాపాడాలనే ఉద్దేశంతో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. వచ్చేనెల 2 నుంచి రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం రెండు గ్రామాలు, సాయంత్రం రెండు గ్రామాలు పాదయాత్ర చేపట్టి మహాత్మాగాంధీ, అంబేడ్కర్ సిద్ధాంతాలు, రాజ్యాంగ విలువలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ ఇన్‌చార్జి శ్రీకాంత్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, నాయకులు ఎన్‌పీ. వెంకటేశ్, జహీర్ అఖ్తర్, సిరాజ్‌ఖాద్రీ, సాయిబాబా, మధుసూదన్‌రెడ్డి, అజ్మత్‌అలీ పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


ఉత్సవాలకు సిద్ధమైన వీరప్పయ్యస్వామి దేవాలయం

దేవరకద్ర: దేవరకద్రలో వందల ఏళ్ల చరిత్ర ఉన్న శివాలయం, వీరప్పయ్యస్వామి దేవాలయాల పునర్నిర్మాణంలో భాగంగా ఆదివారం నుంచి కలశాల ప్రతిష్ఠాపన, నాగదేవత, నవగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. దేవాలయాల గోపురాలను పూర్తిగా తొలగించి పునర్నిర్మాణం పూర్తి చేశారు. దేవాలయ ప్రాంగణంలో పాలరాతి శిలలను వేసి అందంగా ముస్తాబు చేశారు. దేవాలయ ఆవరణమంతా సీసీ పనులు పూర్తి చేసి ఉత్సవాలకు సిద్ధం చేశారు.

- ఆదివారం కలశాల శోభాయాత్ర, యాగశాల ప్రవేశం, గోపూజ, గణపతిపూజ, గౌరిపూజ, శాంతి మంత్ర పారాయణం, కలశపూజ, నవగ్రహ అష్టదిక్పాలక, విగ్రహ జలాధివాసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
- సోమవారం దేవత విశేష పూజ, మృత్యుంజయ హోమం, పీఠ సంస్కరం, పరమపూజ్య 108 రేవణ సిద్ధ చరంతేశ్వర శివాచార్య మహాస్వామిచేతుల మీదుగా యంత్ర ప్రతిష్ఠ, విగ్రహప్రతిష్ఠ, నేత్రోన్మేలనం, బలిహారం, జయాధిహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.
- ఏప్రిల్ 1న మంగళవారం రుద్రపారాయణం, గిరిజాకల్యాణం మహా మంగళహారతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

రైతు'సహకారం'లో ముందంజ



నవాబుపేట: రైతులకు సహకారం అందించటంలో సహకార సంఘం ముందుందని, సాగులో రైతులకు చేదోడుగా నిలిచి వారికి కావాల్సిన ఎరువులు, విత్తనాలు సరఫరా చేసినట్లు సంఘం చైర్మన్ నర్సింహులు వివరించారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సహకార సంఘం రైతు జనసభలో ఆయన మాట్లాడారు. మండలంలో ఇప్పటికే మొత్తం దాదాపుగా కోటి రూపాయల విలువైన ఎరువులు, విత్తనాలు సరఫరా చేశామన్నారు. రైతులకు చాలా సులువుగా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు అందించటంతో రైతులకు చాలా సులువైందన్నారు. రెండు నెలల వ్యవధిలోనే ఏకంగా దాదాపుగా కోటి రూపాయల విలువైన ఎరువులు, విత్తనాలు సరఫరా చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలో శాశ్వత కౌంటర్ ఏర్పాటు చేసి అన్ని రకాల ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. సమావేశంలో సంఘం మాజీ చైర్మన్‌లు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్లు గోపాల్, హన్మంతు, కృష్ణయ్య, సీఈఓ హన్మంతు, డైరెక్టర్లు ప్రతాప్, వెంకటేష్, రాజు, శశిధర్‌రెడ్డి, అంజనేయులు ఉన్నారు.

సమానత్వ సాధనకు చర్యలు తీసుకోవాలి


డీటీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గండేడ్: వ్యవసాయ, అనుబంధ రంగాల్లో మహిళలకు సమానత్వ సాధనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ మల్టీపర్పస్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జ్యోతి పేర్కొన్నారు. శనివారం మహిళా కూలీల హక్కుల సాధన, సాంఘిక భద్రత, సమానత్వ సాధనలపై డీటీ మాధవికి వినతిపత్రం అందజేశారు. ఈ సంర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయంలో నిమగ్నమైన చిన్న, సన్నకారు రైతులు, మహిళా కూలీలు, ఆదివాసీ కుటుంబీకులు, నిర్వాసితులు అంతా శ్రామికులే అన్నారు. వారికి పనికి తగ్గ వేతనం ఇవ్వాలని కనీస సౌకర్యా లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజు, ఉమ్మడి పాలమూరు అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు బోరు కృష్ణయ్య, విక్రమ్, రాము, నారాయణ, చెన్నప్ప పాల్గొన్నారు.

స్వయంపరిపాలన దినోత్సవం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో శనివారం ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయుల స్థానంలో విద్యా బోధన చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో డైరెక్టర్ రామారావు, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



డ్రామా జూనియర్స్‌కు విద్యార్థి ఎంపిక



చిన్నచింతకుంట: మండలంలోని పర్దీపురం గ్రా మానికి చెందిన విద్యార్థి మనోజ్ జీ తెలుగులో ప్ర సారమయ్యే డ్రామా జూనియర్స్ కార్యక్రమానికి ఎంపికయ్యాడు. చిన్నచింతకుంట మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మనోజ్‌కు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు ఖలీం అజాద్ నటనపై ప్రత్యేక శిక్షణ ఇచ్చాడు. దీంతో మనోజ్ డ్రామా జూనియర్స్ కార్యక్రమానికి ఎంపికయ్యాడు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఇసుక టిప్పర్లను అడ్డుకున్న నాయకులు


రాణిపేట వద్ద ఇసుక టిప్పర్లను అడ్డుకున్న నాయకులు

మిడ్జిల్: మండలంలోని అయ్యవారిపల్లిలో గత ఏడాది సీజ్ చేసిన ఇసుక డంపును కలెక్టర్ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ పనులకు శనివారం మండల రెవెన్యూ అధికారులు వే బిల్లు మంజూరు చేశారు. ప్రభుత్వ అనుమతి పేరిట ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారని, మండలంలో ఇసుక కొరత ఉండగా, ఇతర ప్రాంతాలకు ఎలా తరలిస్తారని వివిధ పార్టీల నాయకులు ప్రశ్నించారు. డార్క్ మండలంగా గుర్తించ బడిన మిడ్జిల్ మండలం నుంచి ఇసుక తరలించొద్దని బీఆర్ఎస్ నాయకులు రాణిపేట వద్ద ఇసుక టిప్పర్లను అడ్డుకొని మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ధర్నా నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇసుకను ఇందిరమ్మ ఇళ్లకు, ఇతర సీసీ రోడ్ల నిర్మాణానికి తరలించడం జరుగుతుందని, అడ్డుకోవద్దని తహసీల్దార్ రాజు, ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు సూచించారు. రాత్రి 7.30గంటలకు రూరల్ సీఐ నాగార్జున గౌడ్ సంఘటనా స్థలానికి చేరకొని, అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని సూచించారు. ఈవిషయంపై తహసీల్దార్ రాజును వివరణ కోరగా వే బిల్లు నంబర్లు డంప్ వద్ద రిజిస్టర్‌లో నమోదు చేయడం జరిగిందని, ఎక్కడ పొరపాటు చేయలేదని, కలెక్టర్ ఆదేశాల మేరకు నడుచుకోవడం జరిగిందన్నారు. పోలీసుల జోక్యంతో టిప్పర్లను వదలి పెట్టారు.

భక్తిశ్రద్ధలతో ఆభరణాల శోభాయాత్ర

ఊట్కూరు: ఊట్కూరులో కాళికామాత ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి ఆభరణాల శోభయాత్ర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక చౌడేశ్వరి ఆలయం నుంచి ఆభరణాలను పల్లకీలో ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ఆభరణాలు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి మల్లప్ప, సత్యనారాయణ, మల్లేష్, జయదేవ్, నర్సింహులు, వడ్ల మోనప్ప, గంగాధర్, ఆచారి పాల్గొన్నారు.

మసీదుల్లో ఘనంగా ఇఫ్తార్


ఇఫ్తార్‌లో పాల్గొన్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్/జడ్చర్ల/నవాబుపేట: జిల్లా కేంద్రంలో పలు చోట్ల ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. మజీదులతో పాటు కాలనీల్లో ముమ్మరంగా ఇఫ్తార్ నిర్వహించా రు. పాతతోటలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎన్‌పీ.వెంకటేశ్ పాల్గొని పలువురు ముస్లింలకు ఖజూరా, పండ్లు తినిపించారు. కార్యక్రమంలో చిన్నా, ఖాజాపాషా, రాశీద్‌ఖాన్, సయ్యద్ తఖియొద్దీన్, ఫజల్ పాల్గొన్నారు.

- జడ్చర్ల క్లబ్ రోడ్డులో కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు. మండలంలోని నసరుల్లాబాద్‌లో మాజీ సర్పంచ్ ప్రణీల్ చందర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఇచ్చారు.
- నవాబుపేటలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి మైనార్టీలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వ్యాపారసంఘం మండల అధ్యక్షుడు సుధాకర్‌చారి, అంజయ్య, నిరంజన్, అజహర్‌అలీ, నసీర్, సలాయుద్దీన్ పాల్గొన్నారు.

దేవాలయాల్లో అమావాస్య పూజలు

నవాబుపేట: అమవాస్య సందర్భంగా మండలంలో పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలోని పెద్దశివాలయం, లోకిరేవు వీరభద్రస్వామి దేవాలయం, పర్వతాపూర్ మైసమ్మ దేవాయలంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పర్వతాపూర్ మైసమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

జేపీఎన్‌సీఈలో ఉగాది సంబురాలు


ఉగాది సంబరాల్లో విద్యార్థులతో జేపీఎన్‌సీఈ చైర్మన్ రవికుమార్, అధ్యాపకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రం శివారులోని జయప్రకాశ్ నారాయణ్ ఇంజినీరింగ్ కళాశాల (జేపీఎన్‌సీఈ)లో శనివారం విద్యార్థులతో కలిసి ఉగాది సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కవి పల్లెర్ల రాంమోహన్‌రావు మాట్లాడుతూ మన దేశ సంస్కృతి ఎంతో గొప్పదన్నారు. మన సంప్రదాయంలో వెనుక ధర్మం, మర్మం కలిగి ఉన్నాయన్నారు. మనలో పట్టుదల, జిజ్ఞాస, సాధన ఉంటే ప్రపంచంలో ఎక్కడైనా ఏ రంగంలోనైనా రాణించవచ్చన్నారు. అనంతరం వాసవి కన్యకా పరమేశ్వరస్వామి దేవాలయ ప్రధాన అర్చకులు గొండ్యాల రాఘవేంద్రశర్మతో పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.ఎస్. రవికుమార్, కార్యదర్శి వెంకటరామారావు, ప్రిన్సిపాల్ డా.పి.కృష్ణమూర్తి, అకాడమిక్ డైరెక్టర్ డా.సుజీవన్‌కుమార్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి.ఈ. చంద్రశేఖర్, పరీక్షల నిర్వహణ అధికారి కోటాల సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాన్‌పల్లిలో..

రాజాపూర్: మండలంలోని ఈద్గాన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉగాది సంబరాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, ఉగాది షడ్రుచుల పచ్చడి తయారు చేసి విద్యార్థులకు అందజేశారు. ముఖ్యంగా తెలుగు సంవత్సరాది మన ఉగాది పండుగ అని ఉపాధి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీరోడ్లతో గ్రామాల అభివృద్ధి


వెన్నాచేడ్‌లో సీసీరోడ్లు ప్రారంభిస్తున్న నాయకులు


చిన్నచింతకుంటలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గండేడ్/చిన్నచింతకుంట/అడ్డాకుల: సీసీరోడ్ల నిర్మాణం గ్రామాల అభివృద్ధికి తోడ్పడుతుందని కాంగ్రెస్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని వెన్నాచేడ్ గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు.

- కౌకుంట్ల మండలం అప్పంపల్లిలో ప్రభుత్వం ఎస్ ఆర్ ఈజీఎస్ ద్వారా మంజూరు చేసిన సీసీ రోడ్డు పనులకు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బోయ నర్సింహులు, సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిలు ప్రారంభించారు.
- మూసాపేట మండలం నందిపేటలో కాంగ్రెస్ నాయకులు సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. గ్రామంలోని ఖదీర్ షాపు నుంచి పాఠశాల వరకు సీసీరోడ్డు పనులు చేపట్టారు. కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రావుల రాంరెడ్డి, కైసర్, నరేష్, కృష్ణ, నర్సింహారెడ్డి ఉన్నారు.